సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 3 । జూన్ । 2025



పోట్లదుర్తిలో ఉద్రిక్తత

ఎర్రగుంట్ల మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులకు సంబంధించి సోమవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. -IIలో



నెల్లూరు, చిత్తూరు జట్ల ఘన విజయం

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ -23 వన్డే క్రికెట్ టోర్నీలో నెల్లూరు, చిత్తూరు జట్లు ఘన విజయం సాధించాయి. -IIలో

గరిష్టం/కనిష్టం
37.6/27.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 27.4 - 37.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ డీటీసీగా నిరంజన్ రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఇన్‌చార్జ్ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్‌గా నిరంజన్ నియమితులయ్యారు. ఆయన చిత్తూరు జిల్లా డీటీసీగా పని చేస్తున్నారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీటీసీగా పని చేస్తున్న ప్రసాద్ వ్యక్తి గత పనులపై నెల రోజుల పాటు సెలవుపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ డీటీసీగా నిరంజన్ రెడ్డిని నియమించారు.

జైళ్ల శాఖ డీఐజీగా రవికిరణ్

కడప అర్బన్: కడప నగర శివార్లలో కేంద్ర కారాగారం పక్కనే వున్న జైళ్ల శాఖ రాయలసీమ డీఐజీగా ఎం.ఆర్ రవికిరణ్‌ను నియమించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు నేడో, రేపో అధికారికంగా రానున్నట్లు సమాచారం. ఈయన గతంలో కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా విధులను నిర్వహించారు. ప్రస్తుతం కోస్తాంధ్ర ప్రాంతంలో జైళ్లశాఖ డీఐజీగా పనిచేస్తున్నారు.

ఖైదీలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారంలో ఉన్న ఖైదీలకు మెరుగైన సదుపాయాలు అందించాలని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం జైళ్ల శాఖ అధికారులతో కలిసి ఆయన కడప కేంద్రకారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందించే సదుపాయాలు వసతులపై ఆరా తీశారు. కేంద్రకారాగారం పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. రిమాండ్ ఖైదీ వివరాలు, శిక్ష అనుభవిస్తున్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, జైలు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, డి.టి.సి డిఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డిఎస్పీ బాలస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం రూ. 1,08,353



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సిద్దవటం: సిద్దవటం మండలంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ. 1,08,353 వచ్చినట్లు ఆలయం ఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 మార్చి 2025 నుంచి 2 జూన్ 2025 వరకు స్వామి వారి హుండీలో భక్తులు వేసిన కానుకల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు.కార్యక్రమంలో దేవదాయ శాఖ కొండ గంగమ్మ దేవస్థానం నందిమండల కార్యనిర్వహణాధికారి మారుతిప్రసాద్, సిద్దవటం పోలీసులు శివప్రసాద్‌రెడ్డి, ఆలయ సిబ్బంది చంద్రా, అర్చకులు సుబ్రమణ్యం శర్మ, స్థానికులు వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మహానాడు' కోసం
విద్యుత్ శాఖ బరితెగింపు

ఒక సామాన్యునికి విద్యుత్ కనెక్షన్ కావాలంటే అన్ని పత్రాలు సమర్పించిన తర్వాత రెండు, మూడు రోజులకుగానీ ఇవ్వరు. అదే ఒక ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే సుమారు రూ.2లక్షలకు పైగా డబ్బు చెల్లించిన తర్వాత మెటీరియల్ అంతా రావడానికి కనీసం 15 నుంచి 30 రోజులు వేచిచూడక తప్పదు. తర్వాత కూడా మామూళ్లు ఇవ్వక తప్పదు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా విద్యుత్‌ను వాడితే వారిపై కేసులు పెట్టి జరిమానా విధించి ముక్కుపిండి వసూలు చేస్తారు... కానీ అధికారంలో ఉన్న పార్టీకి సంబంధించిన ప్రైవేటు కార్యక్రమానికి మాత్రం విద్యుత్ శాఖ అధికారులకు ఏ ఉత్తర్వులు అవసరం రాలేదు... నిబంధనలు అసలే అక్కర్లేదు. అక్రమ విద్యుత్‌ను యథేచ్ఛగా వాడుకునేందుకు అధికారులే తలుపులు బార్లా తెరిచారు. విద్యుత్ శాఖలో సీఎండీ, ఎస్ఈ, డీఈల బరితెగింపు చూసి ప్రజలు ఔరా...అని నోరెళ్లబెడుతున్నారు.

- 50 ట్రాన్స్‌ఫార్మర్లు, 150 స్తంభాలు అక్రమంగా వినియోగం
- మీటర్లు కూడా అమర్చకుండానే విద్యుత్ వాడకం
- ఆ భారమంతా ప్రజలపైనే
- 200 మంది ఉద్యోగులు, సిబ్బందికి 24 గంటలు డ్యూటీలు
- ఓ పార్టీ కార్యక్రమానికి ఇంతలా ప్రజాధనం దుర్వినియోగంపై తీవ్ర విమర్శలు





విద్యుత్ స్తంభాలు, దిమ్మెల ఆనవాళ్లు లేకుండా క్రేన్‌తో ఊడబెరుకుతున్న దృశ్యం



ఇంకా తొలగించని ట్రాన్స్‌ఫార్మర్

కడప కార్పొరేషన్: అధికార తెలుగుదేశం పార్టీ కడప నగరంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమం ముగిసింది. ప్రొటోకాల్ బాధ్యతలకే పరిమితం కావాల్సిన అధికారులు...ఆ పేరు చెప్పి సమస్త పనులు చక్కబెట్టారు. జిల్లా కలెక్టర్ మొదలుకొని చిన్నస్థాయి అధికారుల వరకూ అన్ని శాఖల అధికారులు స్వామి భక్తిని ప్రదర్శించడంలో పోటీలు పడ్డారు. కాగా మా రూటే సపరేటు అన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ పది అడుగులు ముందుకేసి సంస్థ ఆదాయాన్ని సైతం ఫణంగా పెట్టి పనిచేశారని తెలుస్తోంది. మహానాడు ఏర్పాట్ల దశ నుంచే సుమారు 150కిపైగా విద్యుత్ స్తంభాలు నాటి, 11 కేవీ విద్యుత్ లైన్ ప్రత్యేకంగా లాగి, 50 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన మెటీరియల్‌ను భారీగా వినియోగించారు. అందులో మహానాడు వేదిక వెనుకవైపు 10 ట్రాన్స్‌ఫార్మర్లను ఏయే కార్యక్రమాలకు వినియోగించాలో రాసి మరీ ఏర్పాటు చేశారు. మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా ప్రత్యేకంగా లైన్లు లాగి పార్కింగ్ స్థలాల్లో, వేదిక చుట్టుపక్కల వెలుతురు కోసం ఉపయోగించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కూర్చొబెట్టడానికి సిమెంటు కాంక్రీట్‌తో రెడీమేడ్‌గా తయారు చేసిన దిమ్మెలను ఏర్పాటు చేశారు. కరెంటు వినియోగాన్ని తెలుసుకునేందుకు కనీసం మీటర్లు కూడా అమర్చలేదు. ఇలా ఏర్పాట్ల నుంచి మహానాడు మూడు రోజులపాటు ఇష్టం వచ్చినట్లు విద్యుత్‌ను లెక్కా పక్కా లేకుండా లక్షల యూనిట్ల విద్యుత్‌ను యథేచ్ఛగా వాడేసినట్లు తెలుస్తోంది. విద్యుత్ సరఫరాలో చిన్న అంతరాయం కూడా కలగకుండా సుమారు 200 మంది విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందికి 24 గంటలపాటు డ్యూటీలు వేసి ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నియమించినట్లు సమాచారం.

ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు ఇలాగే ఇస్తారా?

దీనిపై విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణకు వివరణ కోరగా మహానాడు కార్యక్రమానికి మేం విద్యుత్ ఇవ్వలేదు. వాళ్లు జనరేటర్లు పెట్టుకున్నారు...విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం...ఇందుకు వారు రూ.25వేలు డిపాజిట్ చెల్లించారని చెప్పారు. ఎస్ఈ ఇచ్చిన వివరణపై అనేక సందేహాలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరొక పార్టీయో, వ్యక్తులో ఇలా ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించుకుంటే విద్యుత్ అధికారులు ఇలాగే రూ.25వేలు కట్టించుకొని ఇలాగే ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తారా. ప్రత్యేకంగా లైన్లు లాగి కరెంటు ఇస్తారా...అప్పుడు కూడా మీటర్లు అమర్చకుండా విద్యుత్‌ను వాడేసుకోవచ్చా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా శుభకార్యానికి 12 గంటలు విద్యుత్ వాడితే యూనిట్‌కు రూ.19లు చొప్పున వసూలు చేసే విద్యుత్ అధికారులు రూ.15వేలు కంటే తక్కువ కట్టించుకోరు. ఇంత పెద్ద మహానాడు కార్యక్రమానికి సుమారు పది రోజులు కరెంటు వినియోగిస్తే కేవలం రూ.25వేలు మాత్రమే డిపాజిట్ కట్టించుకోవడం పట్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అడ్డంగా బుక్కయ్యారు



విద్యుత్ లైన్లు, పరికరాలను ట్రాక్టరులో తరలిస్తున్న దృశ్యం

టీడీపీ నాయకులు ఇష్టారీతిన కరెంటును అక్రమంగా వాడుకునేందుకు సాగిలపడి సహకరించిన విద్యుత్ అధికారులు...తాము చేసిన తప్పు మూడో కంటికి తెలియకూడదని అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ మేరకు గతనెల 29వ తేదీ సాయంత్రానికి మహానాడు పూర్తి కాగా, ఆగమేఘాలపై కదిలి యంత్రాంగాన్నంతా వినియోగించి 30వ తేదీ మధ్యాహ్నానికల్లా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, స్తంభాలు, కాంక్రీట్ దిమ్మెలు వంటి ఏ చిన్న ఆనవాళ్లు కూడా దొరక్కుండా పక్కాగా పథక రచన చేశారు. అయితే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా...సాక్షికి అడ్డంగా దొరికిపోయారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను క్రేన్లతో తొలగించడం, విద్యుత్ సామాగ్రిని ట్రాక్టర్లలో తరలించడం వంటి దృశ్యాలు సాక్షి కెమెరాకు చిక్కాయి.

జేఈఈ అడ్వాన్స్‌లో మెరిశారు

ఇటీవల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఇందులో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కష్టపడి చదివారు. ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రి పురానికి చెందిన సాయి అనిష్ రెడ్డి, నాగిరెడ్డి లిఖిత్‌రెడ్డి, సిద్ధవటానికి చెందిన కృష్ణహర్షిత్, చెన్నూరు మండలం కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన మధు మన్మోహిత్ రెడ్డిలు మంచి ర్యాంకులతో మెరిశారు.

సాయి అనిష్ ప్రతిభ



సింహాద్రిపురం: జేఈఈ అడ్వాన్స్ పరీక్షా ఫలితాలలో పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురంకు డాక్టర్ శివన్నారాయణరెడ్డి, డాక్టర్ మాధవి రెడ్డిల కుమారుడు సాయి అనిష్‌రెడ్డి ప్రతిభ కనబరిచాడు. ఆల్ ఇండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించారు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని సాయి అనిష్‌రెడ్డి తెలిపారు.



- సింహాద్రిపురానికి చెందిన నాగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నవీనాల కుమారుడు నాగిరెడ్డి లిఖిత్‌రెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 512వ ర్యాంక్ సాధించారు.లిఖిత్‌రెడ్డి ప్రతిభ చూపడంపట్ల గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

రాణించిన మధుమన్మోహిత్



వల్లూరు(చెన్నూరు): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో చెన్నూరు మండలంలోని కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన మధు మన్మోహిత్ రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా స్థాయిలో 303 వ ర్యాంక్ సాధించాడు. మధు మన్మోహిత్ రెడ్డి తల్లి ప్రశాంతి పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తుండగా, తండ్రి మధు వేణు గోపాల్ రెడ్డి కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ చదివిన మధు మన్మోహిత్ రెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో కెమిస్ట్రీ సబ్జెక్టులో 80 మార్కులు, ఫిజిక్స్‌లో 87 మార్కులు, మ్యాథ్స్‌లో 82 మార్కులతో మొత్తం 249 మార్కులు సాధించాడు. దీంతో ఇతడు సీఆర్ఎల్ ర్యాంకు 303 సాధించాడు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యంగా తెలిపాడు. తమ కుమారుడు జేఈఈ అడ్వాన్స్‌డ్ లో ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల అతని తల్లిదండ్రులు మధు వేణుగోపాల్ రెడ్డి, ప్రశాంతిలు ఆనందం వ్యక్తం చేశారు. కాగా అతడు ఇంటర్లో 991 మార్కులు సాధించాడు.

కృష్ణహర్షిత్‌కు 139వ ర్యాంకు



సిద్దవటం: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సిద్దవటానికి చెందిన మంచాల కృష్ణ హర్షిత్ జనరల్ కేటగిరీలో ఆల్ ఇండియాలో 139వ ర్యాంకు సాధించారు. ఈయన తండ్రి మంచాల ఈశ్వరయ్య కడపలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి రాధిక గృహిణి తమ కుమారుడు కృషి, పట్టుదలతో జేఈఈలో మంచి ర్యాంకు సాధించినందుకు తల్లిదండ్రులు కుమారుడికి అభినందించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో అత్యున్నత నైపుణ్యం పొంది, ఏ1లో ఉన్నతంగా రాణించాలన్నదే తన లక్ష్యమని ర్యాంకర్ మంచాల కృష్ణ హర్షిత్ తెలిపారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ఇన్‌ఛార్జి డీఆర్వో శ్రీనివాసులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి డీఆర్వో శ్రీనివాసులు

కడప సెవెన్‌రోడ్స్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ఇన్‌చార్జి డీఆర్వో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కార నివేదికను అందివ్వాలని ఆదేశించారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఎస్డీసీ వెంకటపతి, జిల్లా రిజిస్ట్రార్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులు

- స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీ వారు తన వ్యవసాయ పొలాల్లోకి వెళ్లేందుకు దారిలేకుండా చేశారని, ఈ విషయంగా తమకు తగిన న్యాయం చేయాలని మైలవరం మండలం నవాబుపేటకు చెందిన వెన్నపూస శివశంకర్ రెడ్డి విన్నవించారు.
- జమ్మలమడుగుకుకు చెందిన హరి ప్రసాద్ తన కుమారుడు తారక రామారావు పేరును లీలా కార్తికేయ గా మార్చుకోనుటకు వినతి పత్రాన్ని సమర్పించారు.
- రాజుపాలెం మండలం వెలవలి గ్రామానికి చెందిన జయంతి తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని విన్నవించారు.
- మైదుకూరు మండల కేంద్రంకు చెందిన నారాయణ తన కుమార్తెకు రాజుపాలెం. మండలం వెల్లాల ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ 'బాబు'

- 4న వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, పార్టీ నేతలు

కడప సెవెన్‌రోడ్స్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకుండా వంచించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా ధ్వజమెత్తారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామ ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీ, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకుని ఆయనకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నేడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించారని విమర్శించారు. అందుకే ఈనెల 4వ తేదీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం అయిన సందర్భాన్ని పురస్కరించుకుని వెన్నుపోటు దినంగా పరిగణిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

ఎన్నికల హామీలు తుంగలో..

తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు.. లేదంటే రూ. 3 వేల భృతిగానీ చెల్లిస్తామని బాబు చెప్పిన హామీ ఏమైందని అంజద్‌బాషా ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద యేటా రూ. 20 వేలు చొప్పున పెట్టుబడిసాయం అందించడం ద్వారా రైతులను ఆదుకుంటామని ఇచ్చిన హామి ఎక్కడికి పోయిందన్నారు. పంటలకు గిట్టుబాటు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. పంటలు నష్టపోయిన వారికి పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించడం లేదన్నారు. ఒక ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకునే వారు ఉంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ. 15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. స్త్రీ శక్తి కింద 18+, 60 ఏళ్లలోపు మహిళలకు రూ. 15 వేలు ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని చెప్పి కొందరికి మాత్రమే ఇప్పటికి ఒక్క గ్యాస్ సిలిండర్ ఇచ్చారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇంతవరకు అమలు చేయలేదన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వకపోవడం వల్ల చాలామంది పేద విద్యార్థులు మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి దీవెన పూర్తిగా రద్దు చేయడం అన్యాయమన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు పెన్షన్ ఇస్తామన్న హామి ఇంతవరకు అమలు కాలేదన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏ బకాయిలు, పీఆర్సీ, ఇంటీరియం రిలీఫ్ ఇవ్వలేదన్నారు. ఉద్యోగులకు రూ. 20 వేల కోట్ల అరియర్స్ ఇవ్వాల్సి ఉందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే రేషన్ సరఫరా చేశారని తెలిపారు. కానీ చంద్రబాబు రేషన్ డోర్ డెలివరీ రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించడం వల్ల పేదలు, మహిళలు రాత్రి 8.30 గంటల సమయంలో కూడా ఎఫ్‌పీ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

- సమావేశంలో వైఎస్సార్ సీపీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్, కార్పొరేటర్ షఫీ, నాయకులు యానాదయ్య, వేణుగోపాల్ నాయక్, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి తప్ప సీమ, ఉత్తరాంధ్ర పట్టడం లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతి తప్ప ఏమి పట్టడం లేదని అంజద్‌బాషా విమర్శించారు. తన కోటరీలో ఉన్న రియల్టర్లు, బాబు సామాజిక వర్గానికి చెందిన వారికి మేలు చేసేందుకే అమరావతి నిర్మిస్తున్నారని ఆరోపించారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, అయితే ఎంతో వెనుకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిని విస్మరించడం అన్యాయమన్నారు. టెన్త్ పరీక్షా ఫలితాలు వచ్చాక 66 వేల మంది విద్యార్థులు రీ కరెక్షన్ కోసం దరఖాస్తు చేయడం మంత్రి లోకేష్ అసమర్థతకు నిదర్శనమన్నారు. ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 4వ తేది ఉదయం 10 గంటలకు కడప నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిర్వహించనున్న ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పంటల సాగుపై రైతులకుఅవగాహన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

సిద్దవటం: రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రైతు రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు.సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పీఎం కిసాన్ పథకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వరి, సజ్జ, చిరుధాన్యాల సాగు, మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు, విస్తీర్ణం పెంపు, ప్రకృతి వ్యవసాయ విధానాల వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీరయ్య మాట్లాడుతూ వరిలో పచ్చిరొట్ట ఎరువుల పంట పూత దశలో ఉన్నప్పుడు కలియదున్నాలని, 2 కిలోలు సూపర్ వేసి దున్నితే త్వరగా కుళ్లుతుందన్నారు. విత్తనశుద్ధిని తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఉద్యానాధికారి జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిలో జూన్, జూలైలో ముదురు కొమ్మలను కత్తిరించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ శాస్త్రవేత్త ఖురేషి, శాస్త్రవేత్త మానస, జిల్లా వనరుల కేంద్రం ఏఓ పద్మజ, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ లాక్కొని పరారైన దొంగ

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామంలో సోమవారం సునీత తన కుమార్తె నైనికతో కలిసి పోస్టాఫీస్ వద్దకు వెళ్లి డబ్బులు కట్టి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి చిన్నారి నైనిక చేతిలో ఉన్న సెల్ ఫోన్ లాక్కొని కొండలోకి పరారయ్యాడు. వెంటనే సునీత గట్టిగా అరవగా అక్కడ ఉన్న వాళ్లు సెల్‌ఫోన్ లాక్కొని పారిపోతున్న వ్యక్తిని వెంబడించగా కనబడకుండా పారిపోయాడు. అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా సెల్‌ఫోన్ దొంగ దొరకలేదు. దీంతో బాధితురాలు సునీత లింగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నలుగురిపై కుక్కల దాడి



కుక్కల దాడిలో బాలిక చేతిపై గాయాలు

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి పొద్దుపోయాక పట్టణంలోని ఎస్‌బీఐ వెనుక వైపు ఉన్న కాలనీలో సుహానా అనే బాలికతో సహా నలుగురిపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వీధి కుక్కలతో పాటు పిచ్చి కుక్క కూడా సంచరిస్తున్నట్లు పట్టణ వాసులు తెలిపారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి పట్టణంలో కుక్కలు తిరగకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు అంజద్, ప్రసాద్, రమేష్, నరసింహ ఫర్హాన్ తదితరులు కోరుతున్నారు.

అల్లాడుపల్లె అర్చీ వద్ద రోడ్డు ప్రమాదం



కారు, ఆల్విన్ లారీ ఢీకొన్న దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని అల్లాడుపల్లె క్రాస్ రోడ్డు వద్ద సోమవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు కారు, ఆల్విన్ లారీ ఢీ కొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం వద్ద జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొని లక్ష్మీపేటకు భూమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి అనే వ్యక్తి పిల్లలను తీసుకుని కారులో వెళుతుండగా క్రాస్ రోడ్డు వద్ద మైదుకూరు వైపు నుంచి వస్తున్న ఆల్విన్ లారీ ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. కారు స్వల్పంగా దెబ్బతినింది.

మద్యం షాపులో చోరీ

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ శివారులో ఉన్న శ్రీ కృష్ణ మద్యం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. మద్యం షాపు యజమాని రామసుబ్బారెడ్డి తమ షాపులో రూ. 30 వేలు విలువచేసే మద్య బాటిళ్లు, క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 5వేలు నగదును అపహరించారని ఫిర్యాదు చేశారన్నారు.

పోట్లదుర్తిలో ఉద్రిక్తత

- పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు
- ఆలయ పరిరక్షణ కోసమే అంటున్న సురేష్ నాయుడు



ప్రహరీ నిర్మాణం చేపట్టొద్దని సంఘటన స్థలంలో బైఠాయించిన గ్రామస్తులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులకు సంబంధించి సోమవారం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ముందు జాగ్రత్త చర్యగా ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోట్లదుర్తి గ్రామానికి చెందిన అనాకపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ నాయుడు తన కోటా కింద గ్రామంలోని పెద్దమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టేందుకు ప్రస్తుతం పూనుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించి 3.09 ఎకరాల భూమి ఉందని, అందులో కొంత భూమిని ఆక్రమణదారులు కబ్జా చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులు దేవాదాయశాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు గతంలో ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టును ఆశ్రయించారు. ఆలయానికి సంబంధించిన మొత్తం స్థలంలో ఆక్రమణలను తొలగించిన తర్వాతే అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. ఆలయ పరిరక్షణ కోసమే ప్రస్తుతం ఉన్న స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నామని ఎంపీ సోదరుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం రమేష్ నాయుడు సంఘటన స్థలానికి వచ్చి చెప్పారు. ప్రహరీ నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఆలయంలో నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహింపజేయడంతోపాటు వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామని తెలిపారు. ఎంపీ నిధులతో ఆలయ పరిరక్షణ కోసం ప్రహరీని నిర్మించాలని నిర్ణయించామన్నారు. గతంలో గ్రామస్తులు ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకుని న్యాయస్థానంలో రెండు పిటీషన్లు వేశారని వాటిని న్యాయ స్థానం కొట్టివేసిందన్నారు. న్యాయస్థానం సూచన మేరకే పనులు చేపడుతున్నామని, ఇందులో తమకు ఎలాంటి స్వార్థం లేదని సురేష్‌నాయుడు తెలిపారు. ప్రహరీని నిర్మించి తీరుతామన్నారు.



సంఘటన స్థలంలో సీఎం సురేష్ నాయుడు



జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

రానున్న కాలంలో రాష్ట్రమంతా జగన్ అడ్డానే

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : రాబోయే ఎన్నికల తర్వాత కడప సహా రాష్ట్రమంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డాగా మారబోతోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు పరచిన ఏకైన నాయకుడుగా చరిత్ర కెక్కారన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు 143 హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇంతవరకు ఒక్కటి కూడా అమలు పరచలేక ఘోరంగా విఫలమైందన్నారు. మహానాడులో పరస్పరం పొగుడుకుంటూ కాలయాపన చేశారే తప్ప ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పలేదన్నారు. నారా లోకేష్ యువగళం పేరుతో పెద్దముడియం మండలంలో పర్యటించిన సమయంలో రాజోలి ముంపు వాసులకు రూ.12 లక్షలు కాకుండా రూ.24 లక్షలు ఎకరాకు ఇస్తామని ప్రకటించారన్నారు. ఇంత వరకు దాని ఊసే లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. అలాగే దాల్మియా పరిశ్రమ ద్వారా ఇబ్బందులు పడుతున్న గ్రామాల ప్రజలకు పరిహారం ఇప్పించడంతోపాటు వారి భూములను సైతం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకు రావాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన నిలబడి ఉద్యమిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, కౌన్సిలర్ పోచిరెడ్డి, బడిగించల జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు, చిత్తూరు జట్ల ఘన విజయం



ఐదు వికెట్లు తీసుకున్న నెల్లూరు జట్టు బౌలర్ ఎన్. భార్గవ్



83 పరుగులు చేసిన నెల్లూరు జట్టు బ్యాట్స్‌మెన్ నిఖిలేశ్వర్ రెడ్డి

కడప వైఎస్సార్ సర్కిల్ : కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ –23 వన్డే క్రికెట్ టోర్నీలో నెల్లూరు, చిత్తూరు జట్లు ఘన విజయం సాధించాయి. సోమవారం వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 225 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 49.4 ఓవర్లలో 387 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కె. నిఖిలేశ్వర్ రెడ్డి 83, జి. మన్విత్ రెడ్డి 67, సోహన్ వర్మ 62 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని పి. కనిష్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీసుకున్నాడు. పి. సాబ్జాన్‌బాషా 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 388 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 36.3 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలయింది. ఆ జట్టులోని పి. కనిష్ 60, పి. సాబ్జాన్ బాషా 41 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎన్. భార్గవ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. ఎస్ అఖిల్ సాలుంకే 2, సయ్యద్ అతిక్ సల్మాన్ 2 వికెట్లు తీసుకున్నారు.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కడప జట్టుపై చిత్తూరు జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 50.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఏ. శివకేశవ రాయల్ 63, సి. విజయ్ రామిరెడ్డి 35 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని మహమ్మద్ 4, పి. అచ్యుతానంద 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 262 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 49.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ 84, నికిత్ గౌడ్ 54 పరుగులు చేశారు. కడప జట్టులోని ఏ. నాగ కుళ్లాయప్ప 3, షేక్ ఆదిల్ హుస్సేన్ 2 వికెట్లు తీసుకున్నారు.

ఇరువురు చైన్ స్నాచర్ల అరెస్టు



నిందితులతో సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన కేసులో త్రీ టౌన్ పోలీసులు ఇరువురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చింతకొమ్మదిన్నె మండలంలోని మర్రి జాషువ, మైదుకూరుకు చెందిన మర్రి జయప్రకాష్‌లు అన్నదమ్ములు. వీరు జులాయిగా తిరుగుతుంటారు. ఈ క్రమంలో త్రీ టౌన్ పరిధిలోని వెంకటేశ్వర ఆలయం సమీపంలో, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయల్‌కౌంటీ వద్ద ఇటీవల మహిళల మెడలో నుంచి బంగారు చైన్‌లను లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా పోలీస్ స్టేషన్‌లలో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ఇద్దరూ సుందరాచార్యుల వీధి మలుపు వద్ద ఉండగా సీఐ గోవిందరెడ్డి, ఎస్‌ఐలు హనుమంతు, వెంకటరెడ్డి, సిబ్బంది దస్తగిరి, సుబ్రమణ్యం, కుమార్, హోంగార్డు జనార్దన్‌రెడ్డిలతో కలిసి వెళ్లి సోమవారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 2.20 లక్షలు విలువైన రెండు బంగారు చైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

5న కలెక్టరేట్ ఎదుట ఆందోళన



మాట్లాడుతున్న కేసీ బాదుల్లా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ (ఆయా) వర్కర్లకు 3 నెలలు పెండింగ్ వేతనాలు చెల్లించి సామాజిక భద్రతా చట్టంలో భాగంగా పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 5న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కేసీ బాదుల్లా తెలిపారు.సోమవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 300 మంది విద్యార్థులకు ఒక ఆయా ఉండటం వల్ల ఆయాలపైన విపరీతమైన పనిభారం పెరిగిందన్నారు. 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని కోరారు. పాఠశాలలను, కళాశాలలను పరిశుభ్రంగా ఉంచే శానిటేషన్ (ఆయా) వర్కర్లు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, ఆయాలు కుమారి, నాగలక్ష్మి, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

చీటీల పేరుతో కుచ్చు టోపీ?

చింతకొమ్మదిన్నె : మండలంలోని చిన్నముసలరెడ్డిపల్లె యూనియన్ బ్యాంకు సమీపంలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తి చీటీల పేరుతో ప్రజల వద్ద నుంచి సుమారు నాలుగు కోట్ల రూపాయలు డబ్బులు వసూలు చేసుకుని పరారైనట్లు స్థానికుల సమాచారం. అతని వద్ద చీటీలు వేసిన పలువురు వ్యక్తులు సోమవారం చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సమీపంలోనే నివాసం ఉంటున్న బాడుగ ఇంటిని కూడా ఖాళీ చేసి వెళ్లాడు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 1వ తేదీన సాయంత్రం అశోక్‌నగర్‌లోని మసీద్‌వీధిలో షేక్ మహబూబ్‌బాషా, తన భార్య ప్యారీజాన్, కుమార్తె ఆయేషా, ఇద్దరు సోదరులతో కలిసి అల్లుడు సయ్యద్ చాంద్‌బాషా(36)ను తమ ఇంటికి పిలిచి దారుణంగా హత్య చేశారు. ఈ హత్య కేసులో నిందితులైన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వారిని నేడో, రేపో అరెస్ట్ చూపి రిమాండ్‌కు తరలించనున్నారు.

యోగా కోసం సిద్దవటం కోటలో స్థల పరిశీలన

సిద్దవటం : యోగా నిర్వహణ కోసం సిద్దవటంలోని మట్లిరాజుల కోటలో స్థలాన్ని సోమవారం కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర 2025 జిల్లా స్థాయి కార్యక్రమాల్లో భాగంగా సిద్దవటంలోని గార్డన్ స్థలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం ఏఓ శంకరయ్య, స్థానిక తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్‌ఓ కేశవులు, పురావస్తు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌తో వ్యక్తిపై దాడి

మదనపల్లె రూరల్ : పోలీసులకు తమ గురించి సమాచారం ఇచ్చాడనే అనుమానంతో ముగ్గురు వ్యక్తులు ఓ వ్యక్తిపై బీరుబాటిల్‌తో దాడిచేసిన ఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. మంజునాథ కాలనీలో టూ టౌన్ పోలీసులు ఆదివారం సాయంత్రం మద్యం, గంజాయి వినియోగం, విక్రయాలపై తనిఖీలు నిర్వహించారు. మధు అనే వ్యక్తి సమాచారం ఇచ్చి ఉంటాడని కొందరు బీరు బాటిల్‌తో దాడిచేసి కొట్టారు.

5న భారీ ప్లాంటేషన్ గ్రీన్ డ్రైవ్

జిల్లా అటవీ అధికారి జగన్నాథ సింగ్



రాజంపేట : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న భారీ ప్లాంటేషన్ గ్రీన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి జగన్నాథసింగ్ తెలిపారు. సోమవారం తన చాంబరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 28 విభాగాలతో జిల్లా వ్యాప్తంగా ప్లాంటేషన్ డ్రైవ్ చేస్తామన్నారు. జిల్లాలో 50 శాతం పచ్చదనం సాధించాలనే ప్రధాన లక్ష్యంతో అటవీశాఖ, వివిధ శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అంతటా 4.5 లక్షల మొక్కలను నాటనున్నట్లు తెలిపారు. రాజంపేట-రాయచోటి రహదారిలోని ఎస్‌ఆర్ పాళెం నగరవనంలో జిల్లా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఎర్రచందనం, వేప, టేకు, నేరెడు, ఉసిరి, వెదురు, చింత, దానిమ్మ, ఎగిసి, గంగరావి, మారేడు, సీతాఫలం, తాండ్ర, శ్రీగంధం, తెల్లమది, మునసంపెంగా, బహునీయతో పాటు మరికొన్ని మొక్కలను నాటుతామన్నారు. అన్నమయ్య హరిత విప్లవంలో భాగం కావాలని ఆయన కోరారు.

అల్ల నేరేడుకు ఊజి దెబ్బ

- కాయలు పక్వానికి రాకుండానే కుళ్లిపోతున్న వైనం
- రైతులను వెంటాడుతున్న గుబులు
- సస్యరక్షణ పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు



రాయచోటి : అల్ల నేరేడు శక్తినందించి ఆరోగ్యానికి మేలు చేయడమే కాదు కొన్ని రకాల రోగాలను నియంత్రించే శక్తి నేరేడు సొంతం. ఒక్క పండే కాదు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఆక్సాలిక్ టానిక్ ఆమ్లం, విటమిన్లు, క్రోమియం వంటివి నేరేడులో పుష్కలం. అలాంటి అల్ల నేరేడుకు తెగుళ్ల రూపంలో ఊజి పురుగులు వెంటాడుతున్నాయి. నిగనిగలాడే నేరేడు పండును సంతృప్తిగా తిందామన్న వారికి పురుగుల రూపంలో భయపెడుతోంది. నేరేడు పండ్లపై ఈ పురుగులు దాడి చేస్తుండటంతో కాయలు పక్వానికి చేరి మాగకుండానే కుళ్లిపోతున్నాయి. ఫలితంగా సాగు, సర్యరక్షణకు పెట్టిన ఖర్చులు కూడా వస్తాయో లేదో అన్న భయం పట్టుకుంది. కొద్దికొద్దిగా దిగుబడి వచ్చినా ప్రస్తుతం నేరేడు పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో పండ్లు రూ.250లు నుంచి రూ.300లు పైనే అమ్ముతుండటంతో నేరేడు తోటలను సాగు చేసిన రైతులు ఆనందపడుతున్న వేల ఊజీ పురుగుల దాడి వారిని కలవరపాటుకు గురి చేస్తోంది. పండ్లతోటల సాగులో భాగంగా మామిడి, జామ, సపోటా తదితర పండ్ల మొక్కలతోపాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నేరేడు పండ్లతోటల పెంపకానికి రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. చిత్తూరు జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలో కూడా అధికంగా సాగులో ఉన్న నేరేడు పండ్లను ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

ఫలితమివ్వని మందుల పిచికారీ..

అల్లనేరేడుకు సోకుతున్న తెగుళ్లు, పురుగుల నివారణకు రకరకాల మందులు పిచికారి చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. గుత్తులు గుత్తులుగా కాయలు కాసి మాగకుండానే మగ్గిపోతుండటాన్ని చూసి రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే మామిడి పంటకు ధరలు లేక కుంగిపోతున్న రైతులు అల్లనేరేడు పంటపై ఊజీ పురుగుల దాడి చూసి వాటి సాగుకు, సంరక్షణకు పెట్టిన డబ్బులు కూడా వచ్చే అవకాశాలు లేవని మథనపడుతున్నారు.

కమిషనర్ సారూ.. ఇదేం తీరు!



టీడీపీ నేతల వినతిపత్రాలను లేచి స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నేతల వినతిపత్రాన్ని సీటులో కూర్చొని స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

- అధికార పార్టీ నేతలకు గులాంగిరి
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల పట్ల నిర్లక్ష్య వైఖరి
- వెల్లువెత్తుతున్న విమర్శలు

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి తీరు రోజురోజుకు వివాదాస్పదం అవుతోంది. ఎమ్మెల్యే మాధవికి తొత్తుగా మారి పక్షపాత ధోరణి ప్రదర్శించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం నాటి సంఘటన ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఓట్లతో గెలుపొంది నగర పాలకవర్గ సభ్యులుగా ఉన్న పదిమంది కార్పొరేటర్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లి వినతి పత్రం ఇస్తే కమిషనర్ చాలా నిర్లక్ష్యంగా కూర్చుని వినతి పత్రం స్వీకరించారు. అదే రీతిలో ఎలాంటి ప్రొటోకాల్ లేని సామాన్య టీడీపీ కార్యకర్తలు వినతి పత్రం ఇచ్చేందుకు వస్తే అత్యంత వినయ విధేయతలతో నిలబడి వినతిపత్రం స్వీకరించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల మాటలకు, వారి సూచనలకు ఎంతటి విలువనిస్తున్నారో దీన్ని బట్టి అర్థమవుతుంది. డిప్యూటీ కలెక్టర్ స్థాయి హోదాలో ఉన్న కమిషనర్ ఇలా దిగజారి ప్రవర్తించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. ఇప్పటికైనా ఆయన వైఖరి మార్చుకోవాలని, ప్రజా సమస్యల పట్ల అందరితోనూ ఒకే రకంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని కార్పొరేటర్లు హెచ్చరిస్తున్నారు. వారిలో మూడుసార్లు వరుసగా గెలుపొందిన సీనియర్ కార్పొరేటర్లు కూడా ఉండటం గమనార్హం.

జయలక్ష్మిపై దాడికి ఎస్ఐదే బాధ్యత



ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన మహిళా నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కొండాపురం మండలం తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన బండారు జయలక్ష్మిపై ఎలాంటి దాడి జరిగినా అందుకు తలమంచిపట్నం పోలీసు స్టేషన్ ఎస్ఐదే బాధ్యత అని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి తెలిపారు. సోమవారం బాధిత మహిళ జయలక్ష్మితో పాటు మహిళా ఐక్య వేదిక నాయకులు జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ జయలక్ష్మికి 17 ఏళ్ల క్రితం మైలవరం మండలం గంగుల నారాయణ పల్లె గ్రామానికి చెందిన మైల శ్రీనివాసులుతో వివాహమైందన్నారు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో పెద్ద మనుషుల సమక్షంలో పదేళ్ల క్రితం విడిపోయారన్నారు. అయితే జయలక్ష్మి ఇచ్చిన కట్నం, భరణం తిరిగి ఇవ్వడానికి తన వద్ద డబ్బులు లేవని మైల శ్రీనివాసులు సర్వే నెంబరు 1241లో తనకున్న 2 ఎకరాల 11 సెంట్ల వ్యవసాయ భూమిని జయలక్ష్మి పేరు మీద 2015లో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చి, అతను మళ్లీ పెళ్లి చేసుకున్నాడన్నారు. ఆ తర్వాత బాధితురాలు జయలక్ష్మి తిరుమలాయపల్లెలో తన పుట్టింటిలో ఉంటూ ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోందన్నారు. అయితే ఇప్పుడు ఆ భూమికి ధర రావడంతో ఆమె మాజీ భర్త, అతని రెండవ భార్య కృష్ణవేణి, అతని అన్న కలిసి ఆ భూమిని తిరిగి ఇవ్వాలని, లేకుంటే చంపుతామని జయలక్ష్మిని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయమై గతంలో కూడా ఆమె జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి కొండాపురం సీఐని కలవగా బాధితురాలి మాజీ భర్త మైల శ్రీనివాసులును పిలిపించి మందలించారన్నారు. కొన్ని రోజులు మౌనంగా ఉన్న అతను తిరిగి ఆమె వెంట పడుతూ భూమి దగ్గరికి వస్తే అక్కడే చంపి పూడ్చి పెడతా అంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 30 వ తేదీన వారు ముగ్గురు కలిసి దౌర్జన్యంగా బాధితురాలి భూమిని దున్నుతుండగా, ఆ విషయం తెలుసుకున్న జయలక్ష్మి పోలీసులను ఆశ్రయించిందన్నారు. తర్వాత తలమంచిపట్నం ఎస్ఐని కలిసి బాధితురాలు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, మైలవరం మండల తహసీల్దార్ ఇచ్చిన నివేదిక చూపించగా ఇవి ఎందుకూ పనికిరావని, ఇలాంటివి 100 డాక్యుమెంట్లు పుట్టించవచ్చు అంటూ ఎస్ఐ ఎగతాళిగా మాట్లాడారని చెప్పారు. బాధితురాలి తరఫున భూమిని గుత్తకు తీసుకున్న పెద్దరంగడిని కూడా ఎస్ఐ బెదిరించారన్నారు. భవిష్యత్తులో జయలక్ష్మికి ఏ హాని జరిగినా అందుకు తలమంచిపట్నం ఎస్ఐనే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బాధితురాలి తరఫున న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.

పథకం ప్రకారం రెచ్చగొట్టి.. కేసుల్లో ఇరికించి..

రాయచోటి : వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టి ఘర్షణకు దిగిన వారిపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేయించారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శిస్తున్నారు. కంచాలమ్మ గండి చెరువులో గత కొద్ది రోజులుగా టీడీపీ నాయకులు జేసీబీలు పెట్టి ట్రాక్టర్ల సాయంతో మట్టిని దోచుకెళ్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన పాపానికి స్థానిక రైతులు పొలాలకు ఎరువుగా మట్టిని తీసుకెళ్లినా ఓర్వలేని టీడీపీ నాయకులు వారిపై దాడికి తెగబడుతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం చెరువులో మట్టి తోలుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో టీడీపీ వారు ఘర్షణకు దిగారు. ఘర్షణలో టీడీపీకి చెందిన ఒక్కరు గాయపడ్డారంటూ ఆసుపత్రికిలో చేరి గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులపైన కేసు నమోదు చేయించారు.